kalamdaily.com


# కలం

ప్రజల గళం...

Follow on: Kalamtelugu

బుధవారం ● 08-04-2026

పేజీలు: 7



SINGLE TOPIC

హాలిడే వెకేషన్

ఎండ భగ్గుమంటున్నది.. ఈ టైమ్‌లో ప్రకృతి ఒడిలో సేదతీరితే మనసుకు కాస్త హాయిగా ఉంటుంది.. సమ్మర్‌లో ఎంజాయ్ చేసినట్టూ ఉంటుంది. ఇందుకోసం ఏ హిల్ స్టేషన్‌కో, ఇతర రాష్ట్రానికో వెళ్లక్కర్లేదు. తెలంగాణలోనే అద్భుతమైన, ఆహ్లాదకరమైన, ప్రకృతి సోయగాలతో కూడిన పర్యాటక ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి.

'తెలంగాణ ఊటీ' అనంతగిరి హిల్స్.. 'తెలంగాణ నయాగరా' బొగత జలపాతం.. 'తెలంగాణ మాల్దీవ్స్' లక్నవరం.. 'తెలంగాణ మినీ మాల్దీవ్స్' సోమశిల.. కాకతీయుల కళా వైభవాలు వరంగల్ కోట, వేయిస్తంభాల గుడి, రామప్ప ఆలయం.. బోటింగ్ విహారానికి నాగార్జున సాగర్, సింగూర్ డ్యామ్.. ప్రకృతి ఒడిలో పరవశించేందుకు మంజీరా వైల్డ్ లైఫ్ శాంక్చువరీ, కిన్నెరసాని వైల్డ్ లైఫ్ శాంక్చువరీ.. అడవుల జిల్లా ఆదిలాబాద్‌లో కుంటాల, పొచ్చెర జలపాతాలు.. ట్రెక్కింగ్‌కు ఫేమస్ నల్లమల.. ఇలా ఎన్నో.. ఎన్నెన్నో.

మరో 15 రోజుల్లో పిల్లలకు సమ్మర్ హాలీ డేస్ వస్తాయి. ఈ సమ్మర్‌లో తెలంగాణలో మీకు నచ్చిన ప్రాంతానికి వెళ్లి ఎంజాయ్ చేయండి. తెలంగాణ టూరిజంపై కలం స్పెషల్ స్టోరీ..

- తెలంగాణ బ్యూరో, కలం

తెలంగాణ టూరిజం

# సమ్మర్‌లో చుట్టేద్దాం

## ప్రకృతి సోయగాలకు ఈ నేల పుట్టిల్లు

## సేదతీరేందుకు పొదరిల్లు


























# తెలంగాణ మిని మాల్దీవ్స్.. సోమశిల

ప్రకృతి అందాలకు నిలయమైన సోమశిల ఇప్పుడు అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా మారుతోంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హెలి-టూరిజం సేవలు త్వరలో హైదరాబాద్-సోమశిల-శ్రీశైలం సర్క్యూట్‌లో ప్రారంభం కానున్నాయి. కృష్ణా నది బ్యాక్ వాటర్స్ పైన హెలికాప్టర్ లో విహరిస్తూ సోమశిల అందాలను చూడటం పర్యాటకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనుంది.

## ప్రత్యేకత

ఇక్కడి కృష్ణా నది బ్యాక్ వాటర్స్, చుట్టూ ఉన్న చిన్న చిన్న దీవులు చూస్తుంటే మాల్దీవులను తలపిస్తాయి. అందుకే దీనిని తెలంగాణ మినీ మాల్దీవ్స్ అని పిలుస్తారు. ఇక్కడ 15 ప్రాచీన శివాలయాల సమూహం ఉంది. అందులో ప్రధానమైనది లలితా సోమేశ్వర స్వామి దేవాలయం. సోమశిల నుంచి శ్రీశైలం వరకు కృష్ణా నదిలో సుమారు 5 గంటల పాటు సాగే లాంచీ ప్రయాణం ఇక్కడి ప్రధాన ఆకర్షణ. దట్టమైన నల్లమల అడవుల మధ్య నుంచి సాగే ఈ ప్రయాణం మరుపురానిది. ఇక్కడ ప్రభుత్వం ఎకో-టూరిజం పార్కును అభివృద్ధి చేసింది. ఒక్కోసారి నది తీరంలో నీరు తాగడానికి పులులు, చిరుతలు వస్తుంటాయి.

## చరిత్ర

సోమశిలలోని శివాలయాలు 7వ శతాబ్దానికి చెందినవని చరిత్ర చెబుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ముంపు బారినపడ్డ గురవుతున్న ఈ ఆలయాలను సురక్షిత ప్రాంతానికి తరలించి పునఃప్రతిష్టించారు. కృష్ణా, తుంగభద్ర నదుల సంగమ ప్రాంతానికి ఇది దగ్గరగా ఉండటంతో చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా ఈ ప్రాంతానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది.

## ఎక్కడ ఉంది?

సోమశిల తెలంగాణలోని నాగర్ కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండలంలో ఉంది. ఇది హైదరాబాద్ నుంచి సుమారు 180 కిలోమీటర్ల దూరంలో, కృష్ణా నది ఒడ్డున సహజసిద్ధమైన వాతావరణంలో కొలువై ఉంది.

## ఎలా వెళ్లొచ్చు?

హైదరాబాద్ నుంచి కల్వకుర్తి, నాగర్ కర్నూల్, కొల్లాపూర్ మీదుగా సోమశిలకు చేరుకోవచ్చు. ప్రయాణ సమయం సుమారు 4 గంటలు. త్వరలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి నేరుగా సోమశిలకు హెలికాప్టర్ సర్వీసులు అందుబాటులోకి వస్తున్నాయి. దగ్గరలోని రైల్వే స్టేషన్ వనపర్తి రోడ్ (సుమారు 60 కి.మీ). అక్కడ నుంచి బస్సు లేదా టాక్సీలో వెళ్లవచ్చు.



# తెలంగాణ మాల్దీవ్స్.. లక్నవరం లేక్

పచ్చని కొండల మధ్య విస్తరించి ఉన్న లక్నవరం చెరువు రాష్ట్రంలోనే అత్యంత ఆదరణ పొందిన పర్యాటక కేంద్రాల్లో ఒకటి. ఇది తెలంగాణ మాల్దీవ్స్‌గా పేరొందింది. ఇక్కడి ప్రధాన ఆకర్షణ సస్పెన్షన్ బ్రిడ్జిలు (వేలాడే వంతెనలు). వీటి మీద నడుస్తూ సరస్సు అందాలను చూడటం పర్యాటకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది.

## ప్రత్యేకత

సరస్సులోని చిన్న చిన్న దీవులను కలుపుతూ నిర్మించిన 3 వేలాడే వంతెనలు ఇక్కడి ప్రధాన ఆకర్షణ. వీటిపై నడుస్తుంటే సరస్సు నీరు, చుట్టూ ఉన్న కొండలు అద్భుతంగా కనిపిస్తాయి. ఈ సరస్సులో మొత్తం 13 చిన్న చిన్న దీవులు ఉన్నాయి. వీటిలో కొన్ని దీవులపై పర్యాటక శాఖ రిసార్టులను నిర్మించింది. స్పీడ్ బోట్, క్రూయిజ్ బోట్ ప్రయాణాలు పర్యాటకులకు సాహసోపేతమైన అనుభూతిని ఇస్తాయి. సాహస ప్రియుల కోసం కయాకింగ్, రాత్రి వేళల్లో టెంట్లు వేసుకుని సరస్సు ఒడ్డున గడిపే సౌకర్యం కూడా ఉంది.

## చరిత్ర

ఈ అద్భుతమైన చెరువును 13వ శతాబ్దంలో కాకతీయ రాజులు నిర్మించారు. రెండు కొండల మధ్య ఉన్న ఖాళీని ఆనకట్టతో పూడ్చి, అడవిలోని వాగుల నీటిని నిల్వ చేసి ఈ సరస్సును రూపొందించారు. అప్పట్లోనే దాదాపు 10,000 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో దీనిని నిర్మించడం కాకతీయుల ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిదర్శనం. లక్నవరం అనే పేరు లక్ష నుంచి వచ్చిందని, ఇక్కడ పండే పంట ద్వారా లక్ష వరహాల ఆదాయం వచ్చేదని ఒక నానుడి. ఈ లేక్‌ని తెలంగాణ మాల్దీవ్‌గా పిలుస్తారు.

## ఎక్కడ ఉంది?

లక్నవరం సరస్సు ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో ఉంది. ఇది వరంగల్ నగరం నుంచి సుమారు 75 కిలోమీటర్ల దూరంలో, హైదరాబాద్ నుంచి సుమారు 210 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అడవుల మధ్య ఉంది.

## ఎలా వెళ్లొచ్చు?

హైదరాబాద్ నుంచి వరంగల్ మీదుగా ములుగు రోడ్డులో ప్రయాణించాలి. వరంగల్ నుంచి ప్రతిరోజూ బస్సులు అందుబాటులో ఉంటాయి. సొంత వాహనాల్లో వెళ్లే వారికి ఈ అడవి మార్గం చాలా అందంగా ఉంటుంది. దగ్గరలోని రైల్వే స్టేషన్ వరంగల్ లేదా కాజీపేట. అక్కడ నుంచి ప్రైవేట్ టాక్సీలు లేదా బస్సుల్లో సుమారు 2 గంటల్లో చేరుకోవచ్చు.



# కాకతీయ శిల్పకళా వైభవం.. వరంగల్ కోట

తెలంగాణ గడ్డపై వీరత్వానికి, కళా వైభవానికి నిలువుటద్దం వరంగల్ కోట. ఒకప్పుడు అజేయమైన కాకతీయ సామ్రాజ్యానికి రాజధానిగా విరాజిల్లిన ఈ కోట, నేడు శిథిలాల మధ్యే తన పూర్వ వైభవాన్ని చాటుతోంది. శతాబ్దాల చరిత్రను తనలో దాచుకున్న ఈ రాతి కట్టడం ఒక పర్యాటక ప్రాంతం మాత్రమే కాదు.. మన పూర్వీకుల ఇంజనీరింగ్ నైపుణ్యానికి, శిల్పకళా చాతుర్యానికి ఒక అద్భుత నిదర్శనం.

## ప్రత్యేకత

ఇక్కడ ఉన్న ఖుష్ మహల్, కాకతీయ శిలా తోరణాలు ప్రధాన ఆకర్షణలు. కోటలో ఏకశిలా ధ్వజస్తంభాలు, అద్భుతమైన శిల్పకళా ఖండాలు కనిపిస్తాయి.

## చరిత్ర

13వ శతాబ్దంలో కాకతీయ చక్రవర్తి గణపతి దేవుడు దీని నిర్మాణాన్ని ప్రారంభించగా, ఆయన కుమార్తె రాణి రుద్రమదేవి పూర్తి చేశారు. ఇది మూడు వరుసల రక్షణ గోడలతో (మట్టి గోడ, రాతి గోడ, అగడ్త) నిర్మితమైంది.

## ఎక్కడ ఉంది?

ఇది వరంగల్ నగరానికి సుమారు 5 కిలో మీటర్ల దూరంలో ఉంది.

## ఎలా వెళ్లొచ్చు?

హైదరాబాద్ నుంచి వరంగల్/కాజీపేట వరకు రైలు లేదా బస్సులో వెళ్లవచ్చు. వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి ఆటోలు లేదా సిటీ బస్సుల ద్వారా కోటకు చేరుకోవచ్చు.



# వేయి స్తంభాల గుడి

## ప్రత్యేకత

వేయి స్తంభాల గుడిని త్రైకూటాలయం అంటారు (శివుడు, విష్ణువు, సూర్యుడు ముగ్గురూ కొలువై ఉంటారు). పేరుకు తగ్గట్టుగానే ఇందులో వెయ్యి స్తంభాలు ఉంటాయి. ఇక్కడ ఉన్న భారీ నంది విగ్రహం ఒకే రాతితో చెక్కబడింది. దీని అలంకరణలు అత్యంత సూక్ష్మంగా ఉంటాయి.

## చరిత్ర

క్రీ.శ. 1163లో కాకతీయ రాజు రుద్రదేవుడు దీనిని నిర్మించారు. నక్షత్రాకారంలో ఉండే ఈ ఆలయం కాకతీయ వాస్తుశిల్పానికి నిదర్శనం.

## ఎక్కడ ఉంది?

వరంగల్ నగరంలోని హన్మకొండ ప్రధాన రహదారిపై ఉంది.

## ఎలా వెళ్లొచ్చు?

వరంగల్ లేదా కాజీపేట రైల్వే స్టేషన్ల నుంచి 5-6 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఆటోలు సులభంగా దొరుకుతాయి.





# రామప్ప

## ప్రత్యేకత

ఇది యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందింది. దీనిపై ఉన్న ఇటుకలు నీటిలో వేస్తే తేలుతాయి. ఇక్కడి శిల్పాలు నలుపు రంగు గ్రానైట్ రాతితో చెక్కబడి, అద్దంలా మెరుస్తూ ఉంటాయి. ఉదయం 6:00 నుంచి సాయంత్రం 6:00 వరకు సందర్శించవచ్చు. వరంగల్ కోటలో సాయంత్రం వేళ సౌండ్ అండ్ లైట్ షో ప్రత్యేక ఆకర్షణ.

## చరిత్ర

క్రీ.శ. 1213లో కాకతీయ సేనాని రేచర్ల రుద్రుడు దీనిని నిర్మించారు. సాధారణంగా దేవుడి పేరుతో ఆలయాలు ఉంటాయి. కానీ ఈ ఆలయానికి దానిని నిర్మించిన ప్రధాన శిల్పి రామప్ప పేరు పెట్టడం విశేషం.

## ఎక్కడ ఉంది?

వరంగల్ నుంచి సుమారు 70 కి.మీ దూరంలో, ములుగు జిల్లాలోని పాలంపేట గ్రామంలో ఉంది.

## ఎలా వెళ్లొచ్చు?

వరంగల్ నుంచి ములుగు వెళ్లే బస్సుల్లో పాలంపేట వరకు వెళ్లొచ్చు. సొంత వాహనం లేదా ట్యాక్సీలో వెళ్లడం సౌకర్యవంతంగా ఉంటుంది.

# తెలంగాణ ఊటీ.. అనంతగిరి హిల్స్

అనంతగిరి హిల్స్ తెలంగాణలోని ప్రముఖ ప్రకృతి సోయగాల కేంద్రంగా ప్రసిద్ధి చెందిన ఒక అద్భుతమైన హిల్ స్టేషన్. ఇది హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో వీకెండ్ టూరిజానికి స్పెషల్ అట్రాక్షన్‌గా మారింది. దట్టమైన అడవులు, చల్లని వాతావరణం, మబ్బులతో కప్పుకున్న కొండలు ఈ ప్రాంతానికి ప్రత్యేక అందాన్ని ఇస్తాయి. ఇక్కడి నుంచే మూసీ నది పుట్టుక అవుతుందనే భౌగోళిక ప్రాముఖ్యత కూడా ఉంది. ట్రెక్కింగ్, క్యాంపింగ్ వంటి అడ్వెంచర్ కార్యకలాపాలకు ఇది అనువైన ప్రదేశం.





### ప్రత్యేకత

హైదరాబాద్ నగరం గుండా ప్రవహించే మూసీ నది (ముచుకుంద నది) ఈ కొండల్లోనే పుట్టింది. దట్టమైన అడవులు, కొండలు, లోయలు, మేఘాల మధ్య దాగి ఉన్నట్లు అనిపించే వ్యూ పాయింట్స్ వల్ల దీనిని తెలంగాణ ఊటీ అని పిలుస్తారు. ఈ అడవిలో అనేక రకాల అరుదైన ఔషధ గుణాలు కలిగిన మొక్కలు, వృక్షసంపద ఉంది. ట్రెకింగ్, హైకింగ్, క్యాంపింగ్ చేసేవారికి ఇది ఒక స్వర్గధామం. ఇక్కడ రెండు ప్రధాన ట్రెకింగ్ మార్గాలు ఉన్నాయి.

### ఎక్కడ ఉంది?

అనంతగిరి హిల్స్ వికారాబాద్ జిల్లాలో ఉన్నాయి. ఇది హైదరాబాద్ నగరానికి వెస్ట్ సైడ్ సుమారు 70 నుంచి 80 కిలోమీటర్ల దూరంలో ఉంది. సముద్ర మట్టానికి దాదాపు 700 మీటర్ల ఎత్తులో ఉండటంతో ఇక్కడ వాతావరణం ఎప్పుడూ ఆహ్లాదకరంగా ఉంటుంది.


### ఎలా వెళ్లాలి?

- హైదరాబాద్ నుంచి వికారాబాద్‌కు సొంత వాహనం లేదా ఆర్టీసీ బస్సుల్లో సులభంగా వెళ్లవచ్చు. చేవెళ్ల మీదుగా వెళ్లే దారి చాలా అందంగా ఉంటుంది. ప్రయాణ సమయం 3 గంటలు.
- హైదరాబాద్ (నాంపల్లి లేదా సికింద్రాబాద్) నుంచి వికారాబాద్‌కు ప్రతిరోజూ ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉంటాయి. వికారాబాద్ స్టేషన్ నుంచి ఆలయానికి ఆటోలు అందుబాటులో ఉంటాయి (సుమారు 6 కి.మీ).

### చరిత్ర

స్కంద పురాణం ప్రకారం.. ద్వాపర యుగంలో మార్కండేయ మహర్షి ఇక్కడ కఠినమైన తపస్సు చేశారు. ఆయన కోరిక మేరకు విష్ణుమూర్తి ఇక్కడ అనంత పద్మనాభ స్వామిగా కొలువుదీరారని చెబుతారు. ఇక్కడి ప్రధాన ఆలయాన్ని సుమారు 400 ఏండ్ల కింద నిజాం ప్రభువుల కాలంలో నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ముస్లిం రాజులు కూడా ఈ ఆలయ విశిష్టతను గౌరవించి దీని అభివృద్ధికి సహకరించారని అంటారు.

## నల్లమల అందాలు



దక్షిణ భారతదేశపు అతిపెద్ద అటవీ ప్రాంతమైన నల్లమల పర్యాటకులకు స్వర్గధామంగా మారింది. దట్టమైన అడవులు, ఎత్తైన లోయలు, జలపాతాలు, వన్యప్రాణుల సవ్వడులతో ఈ ప్రాంతం పర్యావరణ పర్యాటకానికి కేంద్రబిందువుగా నిలుస్తోంది.

### ప్రత్యేకత

ఇక్కడ నాగార్జున సాగర్ - శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఉంది. పులుల సంరక్షణకు ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి. ఇక్కడ అరుదైన వృక్షసంపదతో పాటు చిరుతలు, ఎలుగుబంట్లు, కృష్ణ జింకలు, వందలాది జాతుల పక్షులు నివసిస్తున్నాయి. ఈ కొండల మధ్యే ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం, నవ నారసింహ క్షేత్రమైన అహోబిలం, ప్రసిద్ధ మహానంది వంటి పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. ఇక్కడి ఫరాహాబాద్ వ్యూ పాయింట్ దగ్గర సఫారీలు, ట్రెకింగ్ పర్యాటకులకు ప్రధాన ఆకర్షణ.

### చరిత్ర

పురాణాల ప్రకారం నల్లమల కొండలను శ్రీపర్వతం అని పిలిచేవారు. ఇది ఆదిశేషుడి శరీరం అని.. ఆ శరీరంపైనే శ్రీశైలం కొలువై ఉందని నమ్ముతారు. ఇక్కడ ప్రాచీన తెగ అయిన చెంచులు నివసిస్తున్నారు. వీరి సంస్కృతి, జీవనశైలి నల్లమల చరిత్రలో విడదీయలేని భాగం. శాతవాహనులు, కాకతీయులు, విజయనగర రాజులు ఈ అటవీ ప్రాంతంలోని ఆలయాలను అభివృద్ధి చేశారు. శతాబ్దాల కాలంగా ఈ కొండలు యుద్ధ తంత్రాలకు, ఆధ్యాత్మిక సాధనకు నిలయంగా ఉన్నాయి.

### ఎక్కడ ఉంది?

నల్లమల కొండలు తూర్పు కనుమలలో ఒక భాగం. ఇవి తెలంగాణలోని నాగర్ కర్నూల్, నల్గొండ జిల్లాలు ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల, ప్రకాశం, పల్నాడు, కడప జిల్లాల వ్యాప్తంగా సుమారు 430 కిలోమీటర్ల పొడవునా విస్తరించి ఉన్నాయి.

### ఎలా వెళ్లొచ్చు?

హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే మార్గంలో మన్ననూర్ నుంచి నల్లమల అడవి ప్రారంభమవుతుంది. సుమారు 150 కి.మీ. ప్రయాణం తర్వాత దట్టమైన అడవిలోకి ప్రవేశించవచ్చు. గుంటూరు - ద్రోణాచలం రైల్వే లైన్ నల్లమల కొండల గుండా వెళ్తుంది. నంద్యాల, గిద్దలూరు, మార్కాపురం స్టేషన్లలో దిగి అడవి ప్రాంతానికి చేరుకోవచ్చు. హైదరాబాద్, కర్నూలు, గుంటూరుల నుంచి నిరంతరం ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి.

# నాగార్జున సాగర్

నాగార్జున సాగర్ కేవలం ఒక జలాశయంగానే కాకుండా, ప్రకృతి ప్రేమికులకు, చరిత్రను ఇష్టపడే వారికి, సాహస యాత్రికులకు ఇది ఒక అద్భుతమైన గమ్యస్థానం. సముద్రమంత విస్తరించి ఉన్న నీళ్లు, చుట్టూ ఎత్తైన కొండలు, ఆ పచ్చని ప్రకృతి మధ్య బోటు ప్రయాణం పర్యాటకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది.



## ప్రత్యేకత

ఇది ప్రపంచంలోనే అతిపెద్ద రాతి కట్టడం. దీని నిర్మాణంలో సిమెంట్ కంటే ఎక్కువగా రాళ్లను ఉపయోగించారు. ఇది భారతదేశంలోని అతిపెద్ద బహుళార్ధసాధక ప్రాజెక్టులలో ఒకటి. దీని ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు, వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. డ్యామ్ మధ్యలో ఉన్న ఒక ద్వీపం నాగార్జున కొండ. ఇక్కడ బౌద్ధ మతానికి సంబంధించిన అద్భుతమైన మ్యూజియం ఉంది. బోటులో ప్రయాణించి దీనిని చేరుకోవడం పర్యాటకులకు ఒక గొప్ప అనుభూతి.

## చరిత్ర

1955 డిసెంబర్ 10న అప్పటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దీనికి శంకుస్థాపన చేశారు. ఆయన దీనిని ఆధునిక భారతదేశ దేవాలయం అని పిలిచారు. 2వ శతాబ్దానికి చెందిన ప్రసిద్ధ బౌద్ధ పండితుడు ఆచార్య నాగార్జునుడి పేరు మీదుగా దీనికి నాగార్జున సాగర్ అని పేరు పెట్టారు. డ్యామ్ నిర్మాణ సమయంలో బయటపడిన బౌద్ధ అవశేషాలను నాగార్జునకొండ మ్యూజియంలో భద్రపరిచారు. ఈ ప్రాజెక్టు 1967లో పూర్తయింది.

## ఎక్కడ ఉంది?


నాగార్జున సాగర్ డ్యామ్ తెలంగాణలోని నల్గొండ జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా సరిహద్దుల్లో కృష్ణా నదిపై నిర్మితమైంది. ఇది హైదరాబాద్ నుంచి సుమారు 150 కిలోమీటర్ల దూరంలో ఉంది.

## ఎలా వెళ్లొచ్చు?

హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్‌కు ప్రతిరోజూ అనేక ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉన్నాయి. సొంత వాహనంలో వెళ్లేవారికి ఇక్కడి ఘాట్ రోడ్డు ప్రయాణం చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. నేరుగా సాగర్‌కు రైలు సౌకర్యం లేదు. దగ్గరలోని రైల్వే స్టేషన్ మాచర్ల (సుమారు 25 కి.మీ). హైదరాబాద్ నుంచి వచ్చే వారు నల్గొండలో దిగి కూడా బస్సులో వెళ్లవచ్చు.

# సింగూరు డ్యామ్

ఉమ్మడి మెదక్ జిల్లాకే కాకుండా, భాగ్యనగర వాసుల తాగునీటి అవసరాలకు వెన్నెముకగా నిలుస్తున్న సింగూరు ప్రాజెక్టు ఇప్పుడు పర్యాటక కేంద్రంగా కొత్త రూపు సంతరించుకుంటోంది. డ్యామ్ బ్యాక్ వాటర్స్ వద్ద పర్యాటక శాఖ బోటింగ్ సౌకర్యాన్ని మెరుగుపరచడంతో పర్యాటకుల రద్దీ పెరిగింది.



## ప్రత్యేకత

హైదరాబాద్ నగరానికి తాగునీటిని అందించే ప్రధాన వనరులలో ఇది ఒకటి. ఇది తాగునీటికే కాకుండా, సుమారు 40,000 ఎకరాలకు సాగునీరు అందించడానికి, జలవిద్యుత్ ఉత్పత్తికి (15 మెగావాట్లు) ఉపయోగపడుతుంది. డ్యామ్ దిగువన ఉన్న మంజీరా అభయారణ్యంలో అరుదైన మగ్గర్ మొసళ్లు ఉండటం పర్యాటకులకు ప్రధాన ఆకర్షణ. ప్రాజెక్టు జలాల్లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో స్పీడ్ బోట్లు, పెడల్ బోట్లు అందుబాటులో ఉన్నాయి.

## చరిత్ర

ఈ ప్రాజెక్టు నిర్మాణం 1979లో ప్రారంభమై, 1989లో పూర్తయింది. మంజీరా నదిపై అదనపు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి, అప్పటి మెదక్ జిల్లా అవసరాలతో పాటు హైదరాబాద్ తాగునీటి ఎద్దడిని తీర్చడానికి దీనిని నిర్మించారు.

## ఎక్కడ ఉంది?

సింగూరు డ్యామ్ తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా, పుల్కల్ మండలం పరిధిలోని సింగూరు గ్రామం వద్ద ఉంది. ఇది హైదరాబాద్ నగరం నుంచి సుమారు 90-100 కిలోమీటర్ల దూరంలో, సంగారెడ్డి పట్టణం నుంచి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉంది.

## ఎలా వెళ్లొచ్చు?

హైదరాబాద్ నుంచి ముంబై జాతీయ రహదారి మీదుగా సంగారెడ్డికి చేరుకోవాలి. సంగారెడ్డి నుంచి మెదక్ వెళ్లే మార్గంలో పుల్కల్ మీదుగా డ్యామ్ చేరుకోవచ్చు. సొంత వాహనాల్లో వెళ్లే వారికి ఈ ప్రయాణం చాలా సులభంగా ఉంటుంది. హైదరాబాద్ (ఎంజీబీఎస్, జేబీఎస్) నుంచి సంగారెడ్డికి ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు ఉంటుంది. సంగారెడ్డి నుంచి సింగూరుకు లోకల్ బస్సులు, ఆటోలు అందుబాటులో ఉంటాయి.

# కిన్నెరసాని వన్నెలు



### ప్రత్యేకత

కిన్నెరసాని నదిపై నిర్మించిన డ్యామ్.. దాని చుట్టూ ఉన్న సరస్సు ఎంతో అందంగా ఉంటుంది. వందలాది జింకలు ఉన్న డీర్ పార్క్ ప్రధాన ఆకర్షణ. ఇక్కడ అడవి మధ్యలో ఉండే ఐలాండ్స్ (దీవులు), బోటింగ్ పర్యాటకులకు గొప్ప అనుభూతినిస్తాయి. కిన్నెరసాని వద్ద గ్లాస్ హౌస్, ఎకో-టూరిజం ప్రాజెక్ట్ కింద నిర్మించిన కాటేజీలు ప్రత్యేక ఆకర్షణ.

### చరిత్ర

1977లో దీనిని వన్యప్రాణి అభయారణ్యంగా ప్రకటించారు. ఇది సుమారు 635 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఇక్కడ పులులు, చిరుతలు, అడవి పందులు, రకరకాల పక్షులు నివాసం ఉంటున్నాయి.

### ఎక్కడ ఉంది?

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ మండలంలో ఉంది. భద్రాచలం నుంచి సుమారు 35 కి.మీ. దూరంలో ఉంటుంది.

### ఎలా వెళ్లొచ్చు?

కొత్తగూడెం లేదా పాల్వంచ నుంచి సొంత వాహనాలు లేదా ఆటోల్లో సులభంగా చేరుకోవచ్చు. భద్రాచలం వెళ్లే పర్యాటకులు దారిలోనే దీనిని సందర్శించవచ్చు.

# మంజీరా నాదాలు



### ప్రత్యేకత

ఇది మగ్గర్ జాతికి చెందిన మొసళ్ల సంరక్షణకు ప్రసిద్ధి. ఇక్కడ మొసళ్ల సంతానోత్పత్తి కేంద్రం కూడా ఉంది. 70 జాతుల పైగా స్థానిక, వలస పక్షులు ఇక్కడ కనిపిస్తాయి. సైబీరియా వంటి దూర దేశాల నుంచి పెయింటెడ్ స్టార్క్స్, హెరాన్స్, ఫ్లెమింగోస్ వంటి పక్షులు ఇక్కడికి వస్తుంటాయి. నదిలో బోటింగ్ చేస్తూ మొసళ్లను, పక్షులను చాలా దగ్గరగా చూసే అవకాశం ఉండటం ఇక్కడి ప్రత్యేకత. ఇక్కడ ఒక చిన్న మ్యూజియం, పర్యావరణంపై అవగాహన కల్పించే కేంద్రం ఉంది.

### చరిత్ర

మంజీరా నదిపై సింగూరు డ్యామ్, మంజీరా బ్యారేజీ నిర్మాణం తర్వాత ఏర్పడిన చిత్తడి నేలల ప్రాముఖ్యతను గుర్తించి, 1978లో దీనిని వన్యప్రాణి అభయారణ్యంగా ప్రకటించారు. ఒకప్పుడు అంతరించిపోయే దశలో ఉన్న మగ్గర్ మొసళ్లను సంరక్షించి, వాటి సంఖ్యను పెంచడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషించింది.

### ఎక్కడ ఉంది?

మంజీరా వైల్డ్‌లైఫ్ శాంక్చువరీ సంగారెడ్డి జిల్లాలో ఉంది. ఇది హైదరాబాద్ నగరం నుంచి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో, సంగారెడ్డి పట్టణానికి అతి సమీపంలో మంజీరా నది వెంబడి విస్తరించి ఉంది.

### ఎలా వెళ్లొచ్చు?

హైదరాబాద్ నుంచి ముంబై జాతీయ రహదారి మీదుగా సంగారెడ్డికి చేరుకోవచ్చు. పటాన్‌చెరు మీదుగా సుమారు గంటన్నర ప్రయాణం. సొంత వాహనం లేదా ఆర్టీసీ బస్సుల్లో సంగారెడ్డికి వెళ్లి అక్కడ నుంచి ఆటోలో వెళ్లవచ్చు. దగ్గరలోని రైల్వే స్టేషన్ లింగంపల్లి (సుమారు 30 కి.మీ). అక్కడ నుంచి క్యాబ్ లేదా బస్సులో వెళ్లవచ్చు.

# కుంటాల సవ్వడులు



## ప్రత్యేకత

తెలంగాణలోనే ఎత్తైన జలపాతం కుంటాల. దాదాపు 147 అడుగుల (45 మీటర్లు) ఎత్తు నుంచి కడెం నది నీరు ఇక్కడ కిందకు పడుతుంది.

## చరిత్ర

శకుంతల-దుష్యంతుల ప్రేమ గాథకు ఈ ప్రాంతం సాక్ష్యమని, శకుంతల ఇక్కడి నీటిలోనే స్నానమాచరించేదని, అందుకే దీనికి కుంటాల అనే పేరు వచ్చిందని స్థానికులు నమ్ముతారు.

## ఎక్కడ ఉంది?

నిర్మల్ జిల్లాలోని నేరడిగొండ మండలంలో ఉంది. ఇది హైదరాబాద్ నుంచి సుమారు 260 కి.మీ. దూరంలో ఉంది.

## ఎలా వెళ్లొచ్చు?

హైదరాబాద్ - నాగ్‌పూర్ జాతీయ రహదారి మీద నేరడిగొండ వరకు బస్సులో వెళ్లి, అక్కడి నుంచి ఆటోలు లేదా ప్రైవేట్ వాహనాల్లో 12 కి.మీ. ప్రయాణించి చేరుకోవచ్చు.

# తెలంగాణ నయాగరా.. బొగత



## ప్రత్యేకత

వెడల్పు, నీరు పడే విధానం అమెరికాలోని నయాగరా జలపాతాన్ని పోలి ఉండటంతో బొగత జలపాతానికి 'తెలంగాణ నయాగరా' పేరు వచ్చింది. కుంటాల తర్వాత తెలంగాణలో ఇది రెండో అతిపెద్ద జలపాతం. సుమారు 30 అడుగుల ఎత్తు నుంచి నీరు కిందకు పడుతుంది.

## చరిత్ర

చాలా కాలం వరకు ఈ జలపాతం కేవలం స్థానిక గిరిజనులకు మాత్రమే తెలుసు. దట్టమైన అడవి, రవాణా సౌకర్యాలు లేకపోవడంతో ఇది బాహ్య ప్రపంచానికి తెలియలేదు. గత పదేళ్లలో రోడ్డు మార్గాలు మెరుగుపడటంతో సోషల్ మీడియా పుణ్యమా అని ఈ జలపాతం వెలుగులోకి వచ్చింది.

## ఎక్కడ ఉంది?

బొగత జలపాతం ములుగు జిల్లా వాజేడు మండలంలోని చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉంది. ఇది వరంగల్ నుంచి సుమారు 120 కి.మీ, భద్రాచలం నుంచి 120 కి.మీ, హైదరాబాద్ నుంచి సుమారు 330 కి.మీ దూరంలో ఉంటుంది.

## ఎలా వెళ్లొచ్చు?

హైదరాబాద్ నుంచి వరంగల్ మీదుగా ఏటూరునాగారం చేరుకుని, అక్కడ నుంచి వాజేడు వైపు వెళ్లాలి. వరంగల్ లేదా హన్మకొండ నుంచి నేరుగా బస్సు సౌకర్యం ఉంది. భద్రాచలం సందర్శించే వారు అక్కడి నుంచి వాజేడు మీదుగా సులభంగా చేరుకోవచ్చు (సుమారు 2-3 గంటల ప్రయాణం). దగ్గరలోని రైల్వే స్టేషన్ వరంగల్ లేదా కాజీపేట. అక్కడ నుంచి ప్రైవేట్ వాహనాలు లేదా బస్సుల్లో వెళ్లవచ్చు.

# పొచ్చెర పరవళ్లు



## ప్రత్యేకత

కుంటాల అంత ఎత్తు ఉండకపోయినా.. పొచ్చెర చాలా వెడల్పుగా.. లోతుగా ఉంటుంది. చుట్టూ ఉన్న రాతి పొరల గుండా నీరు పారుతూ అద్భుతమైన దృశ్యాన్ని ఆవిష్కరిస్తుంది. దీన్ని 'మినీ నయాగరా' అని పిలుస్తుంటారు.

## చరిత్ర

సహజసిద్ధంగా ఏర్పడిన ఈ జలపాతం ఎప్పుడూ పారుతూనే ఉంటుంది. ఇక్కడి రాతి నిర్మాణాలు చాలా ప్రాచీనమైనవి.

## ఎక్కడ ఉంది?

ఇది కూడా నిర్మల్ జిల్లాలోనే, కుంటాల జలపాతానికి సుమారు 12 కి.మీ. దూరంలో ఉంటుంది.

## ఎలా వెళ్లొచ్చు?

కుంటాల సందర్శించే వారు సులభంగా పొచ్చెరకు చేరుకోవచ్చు. నేరడిగొండ నుంచి నేరుగా రోడ్డు మార్గం ఉంది.